సాక్షి
కాకినాడ
గురువారం । 7 । డిసెంబర్ । 2023



దివ్యాంగులకు డిజిటల్ బోధన

ప్రభుత్వం దివ్యాంగులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా పాఠశాలల్లో డిజిటల్ విద్యకు ప్రాధాన్యమిస్తోంది.

8 లో



పాక కూలి వృద్ధుడి మృతి

మండల పరిధిలో జి.మేడపాడు ఎస్సీ కాలనీలో ఒక పాక కూలి పోవడంతో మంచంపై నిద్ర పోతున్న వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు.

మిగులు జలాలు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 1,03,111 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు నీటి విడుదలను పూర్తిగా నిలిపివేశారు.

న్యూస్‌రీల్

ఏలేరులోకి 5,578 క్యూసెక్కుల నీరు



ఏలేరు ప్రాజెక్టులోకి చేరిన వరద నీరు

ఏలేశ్వరం: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు ఏలేరు జలాశయంలోకి బుధవారం 5,578 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోని భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 86.56 మీటర్లకు గాను 79.10 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 12.43 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. వర్షాలకు ప్రాజెక్టులో మరింతగా నీటి నిల్వలు పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం విశాఖకు మాత్రమే 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పోలింగ్ స్టేషన్‌ను సందర్శించిన అబ్జర్వర్



రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు ఎస్.యువరాజ్

కాకినాడ: జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు, రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.యువరాజ్ బుధవారం కాకినాడ సిటీ నియోజకవర్గం లోని గాంధీ నగర్ మున్సిపల్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా చేపట్టిన మార్పులు, చేర్పులు, తొలగింపు వంటి అంశాలపై నమోదైన దరఖాస్తులును, రిజిస్టర్లను తనిఖీ చేశారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్, ఈఆర్వో, సీహెచ్ నాగనరసింహారావు, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, పరిశ్రమలు శాఖ జీఎం టీ.మురళీ, కాకినాడ అర్బన్ తహసీల్దార్, ఏఈఆర్ఓ పీవీ.సీతాపతి రావు, బిఎల్ఓ ఎం గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు పునరావాస కేంద్రాల ఏర్పాటు

కాకినాడ సిటీ: తుపాను వల్ల పంట పొలాల్లో నిలిచిన నీటిని త్వరితగతిన తొలగించేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. బుధవారం తాడేపల్లి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి జిల్లా ప్రత్యేక అధికారి యువరాజ్, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ ఎస్ ఇలక్కియలతో కలిసి ఆమె పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐదు గ్రామాల్లో తుపాను ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. నాలుగు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 494 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించి మంచి భోజనం వసతితో పాటు ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించామన్నారు. 105 ఇళ్లు దెబ్బతిన్నాయన్నారు. 53,064 హెక్టార్లలో వరి కోతలు పూర్తికాగా 6956 హెక్టార్లలో చేను పడిపోయిందని, 2779 హెక్టార్లలో నీట మునిగిపోయిందన్నారు. 640 హెక్టార్లలో వరి పన మీద ఉందని, 3283 హెక్టార్లలో పంట కుప్పలా ఉందని వివరించారు. 78 మంది రైతులకు సంబంధించి ఆయిల్‌పామ్, అరటి, కూరగాయలు, బొప్పాయి, పూల తోటలు సంబంధిత 34 హెక్టార్లలో పంట దెబ్బతిందన్నారు. దీని విలువ రూ.7.28 లక్షలు ఉంటుందన్నారు.

వలంటీర్ ఔదార్యం



ఆస్పత్రిలో వెంకట్రావుకు పింఛను అందజేస్తున్న వలంటీర్ కనకదుర్గ

సామర్లకోట: తుపానులోనూ కర్తవ్యాన్ని నెరవేర్చింది సామర్లకోటకు చెందిన వలంటీర్ పోసిన కనకదుర్గ. లబ్ధిదారునికి ఇబ్బంది కలగకూడదనే తపనతో వర్షాన్ని కూడా లెక్క చేయకుండా ముందడుగు వేసింది. సామర్లకోట సచివాలయం-6 పరిధిలోని 15వ వార్డు అల్లంవారి వీధిలో జంగేటి వెంకట్రావు ఉంటున్నాడు. వృద్ధాప్య పింఛనుదారుడైన ఇతను కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పవరలోని ట్రినిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పింఛను గడువు ముగియనుందని గమనించిన వలంటీరు కనకదుర్గ తాను దివ్యాంగురాలైనప్పటికీ చొరవ తీసుకుంది. తుపాను కారణంగా లబ్ధిదారులెవ్వరూ నష్టపోరాదని ప్రభుత్వం ఒకరోజు గడువు పెంచిన నేపథ్యంలో వర్షాన్ని సైతం లెక్కచేయలేదు. వెంకట్రావు చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లి పింఛను సొమ్మును అందజేసింది.

దంచికొట్టిన వాన

- వెలుతూ వెలుతూ.. ముంచేసిన మిచాంగ్
- మంగళవారం రాత్రంతా కుండపోత
- ఆలస్యంగా నాట్లు పడిన వరికి నష్టం
- వివరాల సేకరణకు కదిలిన యంత్రాంగం



కూరాడలో పొలాల్లోని ధాన్యాన్ని రోడ్డుపైకి తెచ్చుకుంటున్న దృశ్యం

సాక్షిప్రతినిధి,కాకినాడ: మిచాంగ్ తుపాను బలహీన పడుతూ జిల్లాను వాన రూపంలో ముంచెత్తింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి వర్షం దంచికొట్టింది. కుండపోతగా కురవడంతో జిల్లా తడిసి ముద్దయ్యింది. దాదాపు జనజీవనం స్తంభించిపోయింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆలస్యంగా నాట్లు వేసిన చోట వరి పంట నేలకొరిగింది. మరికొన్ని చోట్ల నీటమునిగింది. తుని, తొండంగి, కోటనందూరు, శంఖవరం, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, పిఠాపురం తదితర మండలాల్లో వరితో పాటు వాణిజ్య పంటలూ నీట మునిగాయి. ఈ ఏడాదిలో ఒక్క ఈ తుపానుతోనే రికార్డు స్థాయిలో వర్షం పడింది. తొండంగి మండలంలో ఒక్కరోజే అత్యధికంగా 215 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. మూడు రోజుల్లో జిల్లావ్యాప్తంగా 4734.4 మిల్లీమీటర్ల వర్ష కురిసింది. 215.2 మిల్లీమీటర్ల మేర సగటు వర్షపాతం నమోదైంది. బుధవారం వాన తెరిపివ్వడంతో ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు పంట పొలాలకు వెళ్లి నష్టం వివరాలు సేకరణలో తలమునకలయ్యారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏ ఒక్కరికీ నష్టం కలగకుండా పరిహారం అందేలా వివరాలు చూడాలని ఆదేశించారు. ఆమేరకు జిల్లా యంత్రాంగం వడివడిగా అడుగులేస్తోంది. మంత్రి దాడిశెట్టి రాజా తొండంగి మండలంలో పర్యటించి బాధిత రైతులకు భరోసా ఇచ్చారు.

ఆలస్యంగా నాట్లు వేసిన పంట మునక

కరప, సామర్లకోట, పెద్దాపురం, తొండంగి, గొల్లప్రోలు, గండేపల్లి తదితర మండలాల్లో ఆలస్యంగా నాట్లు వేసిన పొలాల్లో పంట నీట మునిగింది. నాట్లు ముందుగా వేసిన రైతులు పంటను ఒబ్బిడి చేసుకుని గట్టెక్కారు. కరప, వలసపాకల, వాకాడ, వేములవాడ, కూరాడ, వేళంగి, జి.భావారం, యండమూరు, పెద్దాపురప్పాడు, పాతర్లగడ్డ, గొర్రిపూడి తదితర గ్రామాల్లో రోడ్లమార్జిన్లలో, లేఅవుట్లలో ధాన్యంపై ప్రభుత్వం సమకూర్చిన బరకాలను కప్పి కొంతవరకు కాపాడుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో వరితో పాటు. పత్తి, టమాటా, బెండ, దొండ వంటి వాణిజ్య పంటలు నీటమునిగాయి. కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులో మూడో రోజు రాకపోకలు నిలిపివేశారు.

కోతలు పూర్తయ్యాయిన పంట	52975 హెక్టార్లు
నేలకొరిగిన పంట	22080 హెక్టార్లు
నీట మునిగిన పంట	12,100 హెక్టార్లు
పనలు మీద ఉన్న పంట	1687 హెక్టార్లు

నష్టం ఇలా..

- తొండంగి మండలం బెండపూడి తారక రామా కాలనీ ముంపునకు గురైంది.
- పల్లపు ప్రాంతాల్లోని పలు వీధుల్లో నాలుగు అడుగుల లోతు వరద ప్రవహించడంతో ఇళ్లలోకి నీరు చేరింది.
- కృష్ణాపురం, ఏవీ నగరం, కొమ్మనాపల్లి ఎ.కొత్తపల్లి, పెరుమాళ్లపురం, తదితర పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.
- పెద్దాపురం నియోజకవర్గం మేడపాడులో పాక కూలి వృద్ధుడు ముక్కుర్తి నాగరాజు(62) మృతి చెందాడు.
- పలు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో పాటు 25 ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతిన్నాయని ఏపీఈపీడీసీఎల్ అధికారులు అంచనా వేశారు. యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నారు.
- భారీ వర్షం కారణంగా12 ఇళ్లు కూలిపోయాయి.
- కిర్లంపూడి మండలం వీరవరంలో రెండు పెంకుటిళ్లు పై కప్పులు దెబ్బతిన్నాయి.
- భూపాలపట్నంలో పాక నేలకొరగగా, గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట, గోకవరంలో ఇంటి గోడలు కూలిపోయాయి.
- గోకవరంలో ఊరకాలువ పొంగి సమీప ప్రాంతాలు జలమయమయ్యాయి. పోలవరం నిర్వాసితుల కోసం నిర్మిస్తున్న దేవీపట్నం ఆర్ అండ్ ఆర్ కాలనీ జలమయం అయ్యింది.
- పత్తిపాడు, శంఖవరం, ఏలేశ్వరం, రౌతులపూడి మండలాల్లో అరటి, మామిడి తోటలు దెబ్బతిన్నాయి. అరటి చెట్లు నేలకొరిగాయి.
- పల్లపు ప్రాంతాల నుంచి నీటిని బయటకు ఇంజిన్ల సాయంతో అధికారులు తోడిస్తున్నారు. ఇందుకు ఎన్ఆర్ఈజీఎస్ కూలీలను వినియోగిస్తున్నారు.

ఉప్పునీటి ద్రావణం పిచికారి చేయండి



పంట చేల నుంచి వర్షపునీరు బయటకు వెళ్లకపోతే వరి మొలకెత్తే అవకాశం ఉంది. రైతులు లీటరుకు ఐదు గ్రాములు ఉప్పు నీటి ద్రావణం పిచికారి చేసుకోవాలి. పనలు, తడిసి నధాన్యపు రాశులపై కూడా పిచికారి చేసుకోవాలి. రైతులు తడిసిన ధాన్యం కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలుచేసేందుకు ఆదేశాలు జారీచేసింది.

– ఎస్ విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖాధికారి

మూడు రోజులుగా వర్షం గణాంకాలు (మి.మీ)

మండలం	4వ తేదీ	5న	6న
శంఖవరం	6.6	35.2	265.6
రౌతులపూడి	2.8	24.0	253.4
గొల్లప్రోలు	25.8	44.4	219.6
తొండంగి	13.2	37.2	189.0
కిర్లంపూడి	20.4	32.6	173.2
కోటనందూరు	8.4	24.2	169.8
ఏలేశ్వరం	9.2	25.4	168.4
ప్రత్తిపాడు	17.6	28.0	162.0
పిఠాపురం	22.4	54.6	158.4
కాకినాడ అర్బన్	36.6	60.2	156.8
యు.కొత్తపల్లి	16.2	45.2	145.8
కాకినాడ రూరల్	18.8	72.6	142.8
జగ్గంపేట	12.2	28.6	140.4
తుని	9.4	26.6	124.2
కరప	32.4	69.4	110.6
కాజులూరు	37.4	79.8	96.8
సామర్లకోట	11.0	55.8	95.8
పెద్దాపురం	12.4	66.4	94.4
తాళ్ళరేవు	28.6	76.8	93.4
గండేపల్లి	10.6	28.8	84.6
పెదపూడి	20.4	74.8	81.2
మొత్తం	402.4	990.6	3126.2
సరాసరి	19.16	47.17	148.9



తాండవ నదిపై నిర్మించిన మినీ రిజర్వాయర్లపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు



వలసపాకలలో ధాన్యంరాశులు విడదీసి ఆరపెట్టుకుంటున్న దృశ్యం



గోకవరంలో నీట మునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

బాధిత రైతులకు అండగా ప్రభుత్వం

మంత్రి దాడిశెట్టి రాజా భరోసా



తొండంగి మండలం ఏ.కొత్తపల్లిలో బాధితులను పరామర్శించేందుకు వరదనీటిలో నడచి వెళ్తున్న మంత్రి రాజా


తొండంగి: మిచాంగ్ తుపాను ప్రభావ బాధిత రైతాంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆర్ అండ్‌బీ మంత్రి దాడిశెట్టి రాజా చెప్పారు. ఏ.కొత్తపల్లిలో బారీ వర్షాలకు దెబ్బతిన పంట పొలాలను బుధవారం ఆయన పరిశీలించారు. తొలుత బెండపూడి తారకరామ కాలనీలో ముంపు ప్రాంతాన్ని పరిశీలించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద నీరంతా పోలవరం కాలువ గట్టుపైకి అడ్డువచ్చి తమను ముంచెత్తుతుందని గ్రామస్తులు మంత్రి రాజా వద్ద వాపోయారు. ముంపు తొలగించేందుకు యుద్ధప్రాతిపదికన డ్రైన్లు తవ్వి పైపులు వేసి శాశ్వత పరిష్కారం చూపాలని పోలవరం డీఈ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. అనంతరం ఏ.కొత్తపల్లిలో సుడిగాలికి దెబ్బతిన్న తలపులమ్మ మెట్ట ప్రాంతం, ఎస్సీకాలనీల్లో ఇళ్లను పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. దాదాపు మూడు అడుగుల లోతున ఈ ప్రాంతం నిండిపోయింది. బురద నీటిలో నుంచి మంత్రి నడిచి వెళ్లి దెబ్బతిన్న ఇళ్లను చూశారు. తక్షణ సహాయంగా ఆయన రూ.లక్ష బాధితులకు అందజేశారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం, పునరావాసం, నిత్యావసర వస్తువులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు. అనంతరం ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్‌తో మాట్లాడి ఎటువంటి వ్యాధులు ప్రబల కుండా ముందస్తుగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంత్రి వెంట తుని వ్యవసాయ మార్కెట్ కమిటీచైర్మన్ మాకినీడి బాబు, తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ పసపులేటి సతీష్, ఏఓ నరసింహం, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, పార్టీ నాయకులు ఉన్నారు.

పంపా పరవళ్లు

- 103 అడుగులకు చేరిన నీటిమట్టం
- 800 క్యూసెక్కుల నీరు కడలిలోకి విడుదల



పంపా గేట్లు ఎత్తి సముద్రంలోకి విడుదల చేసిన నీరు



వరద నీటితో పంపా రిజర్వాయర్

అన్నవరం: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు అన్నవరంలోని పంపా రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. బుధవారం సాయంత్రానికి పంపా నీటిమట్టం 103 అడుగులకు చేరింది. రిజర్వాయర్‌లోకి భారీగా నీరు వస్తుండడంతో బ్యారేజీ గేట్లు ఎత్తి 800 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేసినట్లు రిజర్వాయర్ డీఈ సురేష్ తెలిపారు. తొండంగి వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పంపా ఇరిగేషన్ అసిస్టెంట్ కె. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తం

పంపా రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 105 అడుగులు కాగా 103 అడుగులు దాటితే మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తారు. ప్రస్తుతం పంపాలో 103 అడుగుల నీటిమట్టంతో 0.43 టీఎంసీల నీరు ఉంది. భారీగా వరద నీరు వస్తుండడంతో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నీటిని దిగువకు విడుదల చేయడంతో తొండంగి మండలంలోని కృష్ణాపురం, జిల్లేడుపాడు, తుని మండలం హంసవరం తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ఎలా ఉన్నా ధాన్యం కొనుగోలు చేస్తాం

- అన్ని విధాలా ఆదుకుంటుంది
- ఆందోళన చెందాల్సిన పని లేదు
- జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: తుపానులోవరి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని కలెక్టర్ కృతికా శుక్లా చెప్పారు. బుధవారం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. బాధిత రైతులు అధైర్యపడవలసిన అవసరం లేదన్నారు. ధాన్యం ఏ స్థితిలో ఉన్నా ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. తక్కువ ధరకు మధ్యవర్తులెవరికీ విక్రయించవద్దని హితవు పలికారు. పొలాల్లో నీటిని ఉపాధి హామీ పథకం కూలీల సహకారంతో తోడిస్తామన్నారు. దెబ్బతిన్న ఉద్యాన పంటలకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయశాఖ, మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు సూచనలను, సలహాలను అందించాలని ఆదేశించారు. అధిక వర్షాల వల్ల వరి పంట నష్టపోకుండా ఉండేందుకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా రైతులకు సూచించారు. వ్యవసాయ అధికాఉలు సూచించిన జాగ్రత్తలు చేపట్టి పంట నష్టాన్ని నివారించుకోవాలన్నారు.

- పొలంలో నిల్వ నీటిని మురుగుకాలువల ద్వారా బయటకు పంపేలా ఏర్పాటు చేసుకోవాలి.
- పాలు పోసుకునే దశ లేదా గింజ గట్టిపడే దశలో ఉండి, పడిపోయిన వరి చేలను లేపి నిలబెట్టి జడలుగా కట్టుకోవాలి.



- అధిక వర్షాలకు పంట తెగుళ్లు బారిన పడకుండా, నీరు పూర్తిగా తీసివేసిన తరువాత లీటరు నీటికి 2 మిల్లీ లీటర్ల హెక్సకోనజోల్ లేదా 2 మిల్లీలీటర్లు వాలిడామైసిన్ కలిపి పిచికారి చేయాలి.
- కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటను వర్షాలకు ముందు కోయరాదు.
- కోసిన, పూర్తిగా ఆరని పనలను కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును చల్లుకుంటే నష్టాన్ని నివారించుకోవచ్చు.
- కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిస్తే గింజ మొలకెత్తకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలి. – పొలంలో నీరు నిలిచి ఉంటే పనలను గట్లపైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలి.
- వర్షాలు తగ్గి ఎండ రాగానే పనలను తిరగేసి ఎండబెట్టి నూర్చుకోవాలి.
- కళ్లాల మీద ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలి. నూర్చిన ధాన్యం 2–3 రోజులు ఎండ బెట్టడానికి వీలుకాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడు వాసన వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి కిలో ఉప్పు ..20 కిలోల పొడి ఊక కలిపి క్వింటాలు ధాన్యం పోగు పెట్టుకోవాలి.
- రంగు మారి, తడిసిన ధాన్యం పచ్చి బియ్యం కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని తగ్గించుకోవచ్చు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన

- కాకినాడ జిల్లా ఓటర్ల జాబితా ప్రత్యేకాధికారి యువరాజ్
- ఎస్ఎస్ఆర్–2024పై ఈఆర్వోలతో ప్రత్యేక సమావేశం



ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణపై జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి యువరాజ్, చిత్రంలో కలెక్టర్ కృతికాశుక్లా

కాకినాడ సిటీ: రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడమే లక్ష్యంగా, 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకునేలా ఓటర్ల జాబితా సవరణ చేపడుతున్నట్టు కాకినాడ జిల్లా ఓటర్ల జాబితా ప్రత్యేకాధికారి, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ యువరాజ్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన సంక్షిప్త సవరణ జాబితా–2024పై ఈఆర్వోలతో జరిగిన ప్రత్యేక సమావేశంలో యువరాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో సవరణకు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా, పక్కా రికార్డులు నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితాలో మార్పుచేర్పులకు సంబంధించి ఆయా పంచాయతీలు, వార్డు సచివాలయాల్లో నోటీసులు ఉంచాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయి బీఎల్వోలు, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో జిల్లాలో పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించాలన్నారు. జిల్లాలో ఎస్ఎస్ఆర్–2024 రూపకల్పనపై జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.

గడువులోగా పరిష్కరిస్తాం : కలెక్టర్

జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 1,637 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. అందులో 15,82,112 మంది ఓటర్లున్నారని చెప్పారు. వీరిలో పురుషులు 7,80,027, స్త్రీలు 8,01,898, ఇతరులు 187 మంది ఉన్నారని వివరించారు. మొత్తం 3,30,383 దరఖాస్తులు వచ్చాయని, అందులో 2,99,9958 పరిష్కరించినట్టు చెప్పారు. మిగిలిన వాటిని గడువులోగా పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో రెండు విడతల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటు నమోదు శిబిరాల్లో మొత్తం 4,953 దరఖాస్తు వచ్చాయన్నారు. తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాపై అందిన దరఖాస్తులను ఈ నెల 26 నాటికి పూర్తి స్థాయిలో పరిష్కరించి, వచ్చే ఏడాది జనవరి 5న తుది జాబితాను ప్రచురిస్తామని వెల్లడించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

తొలుత జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి ఎస్ యువరాజ్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువరాజ్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్–2024 రూపకల్పనకు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకున్న చర్యలను వివరించారు. వీటిపై ప్రతి వారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్టు తెలిపారు. జిల్లా దోషరహిత ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, డీఆర్వో కె.శ్రీధర్ రెడ్డి, ఈఆర్వోలైన కాకినాడ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, కాకినాడ ఆర్డీవో ఈట్ల కిశోర్, పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు, తుని ఈఆర్వో ఏపీఎస్ సత్యనారాయణ, ఎ.శ్రీనివాసరావు, సూర్యనారాయణరెడ్డి, సుబ్బారావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆర్ వెంకటేశ్వరరావు, పి.రవికిరణ్, జి.సాయిబాబా, కె.వీరబాబు, ఎస్.అప్పారావు, ఎం రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాక కూలి వృద్ధుడి మృతి



మంచంపై ఉన్న నాగరాజుపై కూలిన పాక



మృతుడు నాగరాజు (పాత చిత్రం)

సామర్లకోట: మండల పరిధిలో జి.మేడపాడు ఎస్సీ కాలనీలో ఒక పాక కూలి పోవడంతో మంచంపై నిద్ర పోతున్న వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తుపాను కారణంగా మూడు రోజులుగా కురిసిన వర్షాలకు పాక తడిసిపోయింది. బుధవారం ఈదురు గాలికి పాక కూలి మంచంపై పడడంతో ముక్కుర్తి నాగరాజు (62) మృతి చెందాడు. వైఎస్సార్ సీపీ నాయకుడు మోరంపూడి శ్రీరంగనాయకులు ఫిర్యాదు మేరకు తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి వీఆర్వోలు, గ్రామ పెద్దలు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

లారీ ఢీ కొని నర్సు మృతి



ఘటనా స్థలిలో పడిపోయిన సత్యవతిని పైకి లేపుతున్న స్థానికులు

సామర్లకోట: లారీ ఢీకొనడంతో నర్సు మృతి చెందింది. స్థానిక గరువులో నివాసం ఉంటున్న నర్సు దొమ్మేటి సత్యవతి (31) బుధవారం మధ్యాహ్నం స్కూటీపై కాకినాడ వెళుతుండగా వెనుక నుంచి లారీ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమె బంధువులు సత్యవతిని హుటాహుటిన ఏడీబీ రోడ్డులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొని వెళుతుండగా ఆస్పత్రికి చేరే సమయానికి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు కథనం ప్రకారం దొమ్మేటి సత్యవతి కాకినాడ జీజీహెచ్‌లో నర్సుగా పని చేస్తోంది. విధులకు హాజరు కావడానికి స్కూటీపై వెళుతూ ఉండగా స్థానిక స్టేషన్ సెంటర్‌లో వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా స్కూటీని ఢీ కొంది. డ్రైవరు నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు డిజిటల్ బోధన

- విద్యార్థులతో పాటు ఐఈఆర్‌టీ, స్పెషల్ టీచర్లకు ట్యాబ్స్
- మొదటి విడతగా 160 మందికి పంపిణీ
- విషయం అర్థమయ్యేలా 26 ప్రత్యేక యాప్‌లు
- వినియోగంపై త్వరలో ఒక రోజు ఓరియంటేషన్



దివ్యాంగ చిన్నారికి బోధన చేస్తున్న ఐఈఆర్‌టీ ఉపాధ్యాయురాలు



విభిన్న ప్రతిభావంతుడైన విద్యార్థికి ఫిజియో థెరపీ సేవలు అందజేస్తున్న వైద్యుడు

రాయవరం: ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా పాఠశాలల్లో డిజిటల్ విద్యకు ప్రాధాన్యమిస్తోంది. ఇప్పటికే పలు పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, స్మార్ట్ టీవీలను అందించగా, గత విద్యా సంవత్సరంలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్‌ను అందజేసింది. సాధారణ విద్యార్థులతో పాటు, విభిన్న ప్రతిభావంతులకు కూడా డిజిటల్ విద్యను అందించే దిశగా అడుగులు వేస్తోంది. విభిన్న ప్రతిభావంతుల జీవితాల్లో వెలుగులు నింపి, వారి కలలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే దివ్యాంగ చిన్నారులకు భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ చేయించడం, పై చదువులు అభ్యసించేలా 10 మార్కుల ఉత్తీర్ణత కొలమానం చేయడం, సహిత విద్యను అందించేందుకు రీసోర్స్ పర్సన్లు, బాగోగులు చూసేందుకు ఆయాలను నియమించడంతో పాటు, తాజాగా భవిత కేంద్రాల్లో అత్యాధునిక ట్యాబ్స్‌ను అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో ఉన్న 22 భవిత కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు, వారికి బోధన చేసే ఐఈఆర్‌టీలు, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు కూడా డిజిటల్ విద్యను అందించే క్రమంలో ట్యాబ్స్‌ను అందజేసింది.

సత్సంకల్పంతో..

జిల్లాలో 22 భవిత కేంద్రాల్లో 465 మంది విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు చదువుతున్నారు. శారీరకంగా, మానసికంగా ఎదుగుదల లేని వారికి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. మానసిక వైకల్యం ఉన్న విద్యార్థులకు రూ.14వేల విలువైన ఎంఆర్ కిట్లు, అత్యాధునిక హియరింగ్ పరికరాలు, ట్రై సైకిళ్లు, బైక్‌లు, మధ్యాహ్న భోజనంతో పాటు బస్‌పాస్‌లు, వారానికి ఒక రోజు ఫిజియో థెరపీ, నడవలేని స్థితిలో ఉన్నవారికి ఇంటి దగ్గరే విద్య, వైద్య సేవలు, నెల నెలా గర్ల్స్ స్టైపెండ్ పేరిట రూ.200, హోమ్ బేస్డ్ అలవెన్స్‌గా నెలకు రూ.300, రీడర్ అలవెన్స్‌గా రూ.300, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌గా రూ.300, ఎస్కార్ట్ అలవెన్స్ రూ.300 నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. తాజాగా మూగ, వినికిడి, దృష్టి లోపంతో పాటుగా పూర్తిగా కనబడని వారు సైతం సాధారణ విద్యార్థుల్లా ఉన్నత విద్యను చదవాలనే ఉద్దేశంతో వారికి ఆధునిక సాంకేతికతతో కూడిన 160 ట్యాబ్స్‌ను ప్రభుత్వం అందజేసింది. విద్యార్థులతో పాటుగా, వారికి బోధించే ఉపాధ్యాయులకు కూడా ట్యాబ్స్‌ను అందజేసింది. వీటి వినియోగంపై త్వరలోనే జిల్లా వ్యాప్తంగా ఒక రోజు ఓరియంటేషన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

విభిన్న ప్రతిభావంతుల్లో వెలుగులు నింపేలా..

6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న దృష్టి, వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు ట్యాబ్స్‌లో ఆధునికమైన కంటెంట్‌ను నిక్షిప్తం చేశారు. బీ మై ఎస్, ఎన్ విజన్ ఆల్, గూగుల్ ట్రాన్స్‌క్రైబ్, గూగుల్ అవుట్ లుక్, డాక్స్, నీట్, జీ బోర్డు, నోట్ ప్యాడ్, గూగుల్ కీ తదితర ప్రత్యేకతలు ఉన్న కంటెంట్‌ను ట్యాబ్స్‌లో పొందుపర్చారు. పూర్తిగా చూపులేని వారికి, పాక్షిక అంధులకు, బధిరులు, పాక్షిక బధిరులకు వీలుగా టాక్ బ్యాక్(ట్యాబ్‌ను ఏ వైపు ఉపయోగించినా స్పందించే యాప్), స్పోకెన్ అసిస్టెంట్ (శబ్ద సాంకేతికతల ద్వారా ట్యాబ్‌ను ఉపయోగించే యాప్), విజిబులిటీ ఇనుస్ట్రుమెంట్), దృష్టి లోపం ఉన్న వారికి చిన్న చిన్న విషయాలను స్పష్టంగా చూడడానికి ఉపయోగించే యాప్, మిషన్ ఏఐ, ×ఎన్‌ో విజన్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే) తదితర ప్రత్యేకంగా రూపొందించిన 26 యాప్‌లను ట్యాబ్స్‌లో పొందుపర్చారు. ట్యాబ్‌లను ఇతర అవసరాలకు ఉపయోగించుకోకుండా ప్రత్యేక లాక్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కో ట్యాబ్ విలువ రూ.29వేలు ఉండగా, వీటికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కీ బోర్డు విలువ రూ.8వేలు ఉంటుంది. మొత్తంగా ఒక్కో ట్యాబ్ విలువ రూ.37వేలు.

జిల్లాలో భవిత కేంద్రాలు	22
విద్యార్థులు	465
ఐఈఆర్‌టీలు	44
ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్	25
ఫిజియోథెరపిస్టులు	02
ఆయాలు	22

ట్యాబ్‌ల పంపిణీ ఇలా..

ఐఈఆర్‌టీలు	27
ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు	25
వినికిడి లోపం ఉన్న విద్యార్థులు	60
దృష్టి లోపం ఉన్న విద్యార్థులు	48

విప్లవాత్మకమైన చర్యలు



ప్రభుత్వం దివ్యాంగుల విద్య విషయంలో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు డిజిటల్ విద్యను ప్రవేశ పెట్టడం గొప్ప విషయం. దీని ద్వారా విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులు సులువుగా అభ్యసన చేసే వీలుంటుంది.

– ఎంపీవీ సత్యనారాయణ, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్, అమలాపురం

నిరంతర పర్యవేక్షణ



సహిత విద్య అమలు విషయంలో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులకు అందించే సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఒక్కరికే అందేలా చర్యలు తీసుకుంటున్నాం. డిజిటల్ విద్యలో భాగంగా ట్యాబ్స్‌ను అందజేసి, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా దోహదపడుతోంది. ట్యాబ్స్ వినియోగంపై త్వరలోనే ఓరింటేషన్ నిర్వహిస్తాం.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం

పాల్గొన్న మూడు జిల్లాల ఎస్పీలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా ప్రధాన న్యాయస్థాన ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత బుధవారం ఉమ్మడి గోదావరి జిల్లా పోలీసు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 9న జిల్లా వ్యాప్తంగా జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన ఎక్సైజ్ కేసులు, క్రిమినల్ కేసులు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఇరు పక్షాల వారికి జాతీయ లోక్ అదాలత్‌పై తెలియజేసి వారి సమస్యలను రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, జిల్లా ఎస్పీ పి.జగదీష్, కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్పీ పి.సతీష్ కుమార్, కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ పి.సోమశేఖర్, ఎక్సైజ్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నేడు మహిళా సమాఖ్య భేటీ

సామర్లకోట: కాకినాడ జిల్లా పరిధిలోని జిల్లా మహిళా సమాఖ్య సమావేశం గురువారం స్థానిక టీటీడీసీలో జరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఐ.కాంచన అధ్యక్షత వహిస్తారన్నారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

కొవ్వూరు: కాపవరం గ్రామంలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. వీరి నుంచి రూ.19,880 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఘనంగా హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం



హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవంలో ప్రసంగిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: కాకినాడలోని భానుగుడి పోలీస్ కన్వెన్షన్ హాలులో 61వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్పీ సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీసుశాఖకు అనుబంధంగా హోంగార్డులు విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డు వ్యవస్థ ఎంతో కీలకంగా పనిచేస్తుందన్నారు. విజిలెన్స్, స్త్రీ శిశు సంక్షేమశాఖ, ట్రాన్స్‌పోర్టు, ఫైర్, సబ్‌జైలు తదితర సర్వీసుల్లో హోంగార్డులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. హోంగార్డుల సంక్షేమాన్ని ప్రభుత్వం గుర్తించిందని, దశలవారీగా వారికి పలు అంశాల్లో ఆర్థిక సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. భవిష్యత్‌లో హోంగార్డులంతా మరింత అంకిత భావంతో పనిచేసి జిల్లా పోలీసుశాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు. అదనపు ఎస్పీలు శ్రీనివాస్, సత్యనారాయణ, ఏఆర్‌డీఎస్పీ వెంకటఅప్పారావు పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్ట్

కొవ్వూరు: అంతర జిల్లాల్లో మోటారు సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్న కేసులో మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన పంచదార నవీన్‌ను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. నిందితుడి వద్ద 11 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో మూడు కేసుల్లో మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. విచారణలో చోరీల చిట్టా బయటపడినట్లు ఆయన తెలిపారు. వివిధ జిల్లాల్లో ఎనిమిది పోలీసు స్టేషన్ల పరిధిలో నిందితుడు మోటారు సైకిళ్ల చోరీకి పాల్పడినట్లు తెలిపారు. తణుకు పోలీసు స్టేషన్‌కి సంబంధించి ఒకటి, రాజమహేంద్రవరం టూటౌన్ పరిధిలో రెండు, వన్ టౌన్ స్టేషన్ పరిధిలో ఒకటి, త్రీటౌన్ పరిధిలో ఒక మోటారు సైకిల్ చోరీకి పాల్పడినట్లు తెలిపారు. కోరుకొండ పరిధిలో ఒకటి, అనకాపల్లి టౌన్ స్టేషన్ పరిధిలో ఒకటి, విశాఖపట్నం హార్బర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక మోటారు సైకిల్‌ను నిందితుడు చోరీ చేసినట్టు విచారణలో తేలిందన్నారు. నిందితుడి వద్ద 11 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందుతుడిని పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకి హాజరు పరిచినట్లు తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బీభత్సం



ప్రమాదానికి కారణమైన బస్సు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

- అయ్యప్ప భక్తులను ఎక్కించుకునేందుకు వస్తుండగా బ్రేక్ ఫెయిల్
- కార్లు, ఆటోలు, మోటారు సైకిళ్లను ఢీకొట్టిన వైనం
- వాహనాలలోని నలుగురికి గాయాలు

కాకినాడ రూరల్: అయ్యప్ప భక్తులను శబరిమలై తీసుకు వెళ్లేందుకు ఖాళీగా పిఠాపురం నుంచి కాకినాడ వస్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఆదిలోనే హంసపాదు అన్నట్టు ప్రమాదానికి గురయ్యి నిలిచిపోయింది. ఇందుకు సంబంధించి సర్పవరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక నాగమల్లి జంక్షన్ వద్దకు బుధవారం రాత్రి వచ్చే సరికి ట్రాఫిక్ సిగ్నల్ లైట్ పడడంతో వాహనాలు ఆగాయి. ఈలోగా అక్కడకు చేరుకున్న బస్సు మాత్రం బీభత్సం సృష్టించింది. బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో ముందున్న వాహనాలను ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కార్లు, రెండు ఆటోలు, రెండు మోటారు సైకిళ్లు దెబ్బతిన్నాయి. వాటిలోని నలుగురు వ్యక్తులు గాయాలతో బయటపడ్డారు. బ్రేక్ ఫెయిల్ కావడంతో కొద్ది దూరం వెళ్లి డివైడర్ గోడను ఢీకొని బస్సు నిలిచిపోయింది. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. బస్సులో స్వాములు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అదే విధంగా విపరీతంగా రద్దీగా ఉండే నాగమల్లి జంక్షన్ వద్ద ప్రమాద సమయంలో పెద్దగా జనాలు లేరు. ప్రమాదంలో గాయపడిన పిఠాపురానికి చెందిన కారు నడుపుతున్న యజమాని బడగల అరుణ సుధ భర్త జశ్వంత్ రవీంద్ర ఫిర్యాదు మేరకు ట్రావెల్ టూరిస్ట్ బస్సు డ్రైవర్‌పై సర్పవరం స్టేషన్‌లో ఏఎస్సై నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు. బస్సు ప్రమాదం గురించి తెలుసుకున్న అందులో ప్రయాణానికి సిద్ధంగా వేచి ఉన్న కాకినాడ, పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప స్వాములు ఒక్కసారిగా ఉలిక్కిపడి, భగవంతుడు ఉన్నందునే ఎక్కకుండానే బస్సు నిలిచిపోయిందని తెలియజేశారు.

సైనికా ...సలాం!



జిల్లా సైనిక సంక్షేమానికి విరాళం అందజేస్తున్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: మాతృభూమి కన్న తల్లితో సమానం..భూమాత ఒడిలో ప్రజలందరూ ఎల్లవేళలా క్షేమంగా ఉండాలని దేశ సరిహద్దుల్లో నిరంతరం పహారా కాస్తున్నారు భారత సైనికులు. భరతమాత సేవకు జీవితం అంకితం చేస్తున్నారు. కుటుంబం, బంధుత్వాలు, సుఖాలకు దూరంగా ఉంటూ దేశరక్షణే లక్ష్యంగా తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతున్న సైనికులంటే మనదేశంలో ప్రత్యేక గౌరవం ఉంది. ఇప్పుడు అటువంటి సైనికుల పట్ల మనకు ఉన్న గౌరవాన్ని చాటుతూ సైనికుల కుటుంబాలకు మేమున్నామంటూ తమ వంతు చేయూతనిచ్చే అవకాశం వచ్చింది. అందుకే గురువారం ఫ్లాగ్ డే పేరుతో సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహించుకుంటున్నాం.

దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులు, యుద్ధ సమయంలో అవయవాలను కోల్పోయిన వీరసైనికులకు బాసటగా నిలిచేందుకు సాయుధ దళాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. 1949 డిసెంబర్ 7న త్రివిధ దళాల పతాక దినోత్సవం నిర్వహించడం ప్రారంభించారు. అయితే 1993లో ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్ పేరుతో నిధిని ఏర్పాటు చేశారు. దేశరక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. అప్పటి నుంచి ఏటా డిసెంబర్ ఒకటి నుంచి ఏడవ తేదీ వరకు సాయుధ దళాల వారోత్సవాలు నిర్వహించి ఏడవ తేదీన ఫ్లాగ్‌డేగా ప్రజలు, సంస్థల నుంచి విరాళాలు సేకరిస్తారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ రంగాలకు చెందిన సైనికులు, వారి కుటుంబీకులు, వితంతవులకు చేయూతనిచ్చేందుకు విరాళాలను సేకరిస్తారు. విరాళాల ద్వారా వచ్చిన సొమ్మును అధికారుల ద్వారా వైకల్యం పొందిన మాజీ సైనికులు/వారి కుటుం సభ్యులు,వితంతువులకు అందజేస్తారు.

పతాక దినోత్సవం విశిష్టత..

దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన వీర జవాన్‌లను కాపాడటంలో నిరంతరం సేవలందించే సైనికులను గుర్తుచేసుకుంటూ వారి కుటుంబ సభ్యుల త్యాగనిరతిని స్మరించుకునే రోజే త్రివిధ సాయుధ దళాల పతాకదినోత్సవం, ఆరోజు

నేడు సాయుధ దళాల పతాక దినోత్సవం

విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్స్ ప్రజలకు పతాకాన్ని అందించి హుండీ ద్వారా విరాళాలు స్వీకరిస్తారు. దీంతో పాటు ఆన్‌లైన్ ద్వారా కూడా విరాళాలను పంపవచ్చు. ప్రజలు ఎవరైనా మాజీ సైనికులకు చేయూతనివ్వదలిచిన వారు కాకినాడలోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో అందజేసి రశీదు పొందవచ్చు. డీడీరూపంలో కానీ, నెఫ్ట్ ద్వారా కానీ జిల్లాసైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్, ఈస్ట్‌గోదావరి అండ్ కాకినాడ పేరుతో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, జిల్లాపరిషత్ బ్రాంచ్, కాకినాడ, అకౌంట్ నంబర్ 62064060623, ఐఎఫ్ఎస్‌సీకోడ్ ఎస్‌బీఐఎన్0020974, ఎంఐసీఆర్ కోడ్ -533002028కు పంపవచ్చు. విరాళాలు ఇచ్చే వారికి సెక్షన్ 80జీ ఆదాయపు పన్ను చట్టం కింద పన్ను నుంచి మినహాయింపు ఉంటుంది.

దేశసైన్యంలో ఉమ్మడి జిల్లా ప్రాధాన్యం

దేశసైన్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ఇప్పటికే వేలసంఖ్యలో సైన్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లా వాసులు పనిచేయడం మన జిల్లాకు దక్కిన గౌరవం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా త్రివిధ దళాల్లో 2,981 మంది మాజీ సైనికులు పనిచేసి ఉన్నారు. వీరిలో ఆర్మీలో 2059, ఎయిర్‌ఫోర్స్‌లో 666, నేవీలో 256మంది ఉన్నారు. వీరితోపాటు సైన్యంలో కుటుంబ సభ్యులను కోల్పోయిన వితంతవులు ఆర్మీలో 1,286 మంది, ఎయిర్‌ఫోర్స్‌లో 129మంది, నేవీలో 33మంది ఉన్నారు. వీరందరికి ప్రభుత్వం పరంగా పలు ప్రయోజనాలు లభిస్తున్నప్పటికీ వారి సేవలకు ఎంతచేసినా తక్కువే అన్నభావనతో పౌరులు స్పందించి తోచిన సాయం చేసి సైనికులకు వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించే యత్నమిది.

సైనికుల త్యాగనిరతిని స్మరించుకుందాం



దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన వీర సైనికులను, వారి కుటుంబ సభ్యుల త్యాగనిరతిని స్మరించుకునేందుకు త్రివిధ సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహిస్తున్నాం. దేశసైనికుల చేసిన సేవలకు వెలకట్టలేం. తోచిన సాయం చేసి వారి కుటుంబాలకు మేమున్నామన్న భరోసా కల్పించడమే లక్ష్యం.

– కెప్టెన్ డాక్టర్ పి.సత్యప్రసాద్ (విశ్రాంత), జిల్లా సైనిక సంక్షేమాధికారి, తూర్పుగోదావరి జిల్లా